

సమస్యల స్వాగతం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 24 : సిద్దిపేట నూతన కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి శనివారం బాధ్యతలు చేపట్టారు. మొదటిసారిగా కలెక్టర్ హోదా స్వీకరించిన ఆయనకు జిల్లాలోని అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గతంలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన నేపథ్యంలో పాలనా యంత్రాంగంపై సరైన అవగాహనే ఉంటుంది. అయితే కీలకమైన సిద్దిపేట జిల్లా రథసారధిగా పెనుసవాళ్లను అధిగమించాల్సిన బాధ్యత కొత్త కలెక్టర్‌పై ఉంది. యువ ఐఏఎస్ అధికారిగా ఓవైపు పరిపాలనలో, మరోవైపు అభివృద్ధి,సంక్షేమంలోనూ తనదైన ముద్ర వేయాల్సి ఉంది.

2017 ఐఏఎస్ బ్యాచ్ అధికారి

2016 అక్టోబరు11న ఏర్పాటైన సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా వెంకట్రామారెడ్డి ఆనాడు బాధ్యతలు చేపట్టారు. రెండు దఫాలుగా సుదీర్ఘకాలం పాటు ఆయన కలెక్టర్‌గా ఉన్నారు. మధ్యలో యువ ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్, ఆ తర్వాత ప్రశాంత్ జీవన్ పాటిల్ బాధ్యతలు నిర్వర్తించారు. కొద్దిరోజులపాటు హనుమంతరావు పూర్తిస్థాయిలో అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కలెక్టర్‌గా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి మను చౌదరి బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాకు కొత్త అధ్యాయం మొదలైనట్లుగానే భావించాలి.

అభివృద్ధి, సంక్షేమాలే టార్గెట్‌గా..

గత ప్రభుత్వ హయాంలో నాటి సీఎం కేసీఆర్, కీలక మంత్రి హరీశ్‌రావు ఇదే జిల్లా నుంచి ప్రాతినిత్యం వహించారు. అప్పుడు పెద్దఎత్తున జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో కొన్ని గమ్యం చేరగా కొన్ని ప్రగతిలో ఉంటే ఇంకొన్ని నత్తనడకన సాగుతున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయకసాగర్, కొముురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువలను నిర్మించాల్సి ఉంది. సిద్దిపేటలోని వెయ్యి పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. కలెక్టరేట్ సమీపంలో నిర్మిస్తున్న వెటర్నరీ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరంలోపు పూర్తి చేయాల్సి ఉంది. సిద్దిపేట మీదుగా నిర్మిస్తున్న మెదక్-ఎల్కతుర్తి, సిరిసిల్ల-దుద్దెడ జాతీయ రహదారుల పనులను వేగిరం చేయక తప్పదు. హుస్నాబాద్ ప్రాంతంలో నిర్మించనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు భూసేకరణ చేయాల్సి ఉంది. వీటితోపాటు ఇతరాత్ర అభివృద్ధి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీల పథకాలను క్షేత్రస్థాయిలో అందించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. గత ప్రభుత్వంలోని పలు సంక్షేమ పథకాల ఆచరణలో అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాజా పథకాలను పారదర్శకంగా అమలు చేసేలా కృషిసల్పాలి.

వీటిపై దృష్టిసారిస్తే..

- పలు తహసీల్దార్ కార్యాలయాలు అవినీతి కేంద్రాలనే ఆరోపణలు ఉన్నాయి. ధరణి పోర్టల్ లోటుపాట్లను అడ్డం పెట్టుకొని రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. మ్యూటేషన్లు, సీలింగ్, నిషేధిత భూముల విషయాల్లో అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. పలుచోట్ల ఆందోళనలు చోటుచేసుకున్నాయి.
- ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించే విషయంలోనూ 59జీవో నిబంధనలను పలువురు తహసీల్దార్లు తుంగలో తొక్కారు. 500 చదరపు గజాల కంటే ఎక్కువగా ఉన్న భూములను ఎలాంటి అనుమతులు లేకున్నా పెద్దసంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేశారు. సిద్దిపేట అర్బన్ మండలంలో ఈ సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.
- ప్రజలకు చేరాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టిస్తున్న ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. జిల్లా నుంచి పెద్దఎత్తున పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుంటున్నారు.
- జిల్లాలోని వాగుల్లో నుంచి ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. మామూళ్లతో కళ్లుగప్పి అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
- గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో సుమారు వెయ్యికిపైగానే పూర్తయినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి.
- మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లలో ముంపునకు గురైన భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం దక్కలేదనే ఫిర్యాదులున్నాయి.
- మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.
- ఇటు కలెక్టరేట్‌లో, అటు రెవెన్యూ వ్యవస్థలో పలుమార్లు లంచావతారాలను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అవినీతిరహిత పాలనపై దృష్టి సారించాల్సి ఉంది.
- ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి. కొంతమంది బాధితులు ఐదారుసార్లు ప్రదక్షిణలు చేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదని చెబుతున్నారు. ఇలాంటి వారికి శాశ్వత పరిష్కారం లేదా సరైన మార్గం చూపించి మళ్లీ ప్రజావాణికి రాకుండా చేయాల్సిన అవసరం ఉంది.
- గత మూడు దఫాలుగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉంటున్నది. ఈసారి కూడా ఆ స్థానాన్ని నిలబెట్టుకునేలా సమీక్షించాలి.
- అప్పుడే వానాకాలం సీజన్‌పై దళారులు కన్నేసి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఘటనలు జిల్లాలో వెలుగుచూశాయి. రైతుల సంక్షేమం కోసం నకిలీల బెడదను అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలి.

కొత్త కలెక్టర్‌కు సవాళ్లు

- బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి
- ధరణి రిజిస్ట్రేషన్లపై అనేక ఆరోపణలు
- 59 జీవో ద్వారా పలుచోట్ల అక్రమాలు
- రిజర్వాయర్ల అనుసంధాన కాలువల నిర్మాణం జాప్యం
- అడ్డగోలుగా ఇసుక, రేషన్ బియ్యం దందా
- పంపిణీకి నోచని వెయ్యికిపైగా డబుల్ ఇళ్లు
- పనుల కొనసాగింపుపై పర్యవేక్షణ అవశ్యం



బదిలీపై వెళ్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ మను చౌదరి దంపతులతో జిల్లా అధికారులు

ప్రశాంతమైన పరిపాలనకు మారుపేరు ప్రశాంత్

- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి
- సిద్దిపేట కలెక్టర్‌గా పనిచేయడం ప్రత్యేక అనుభూతినిచ్చింది
- పూర్వ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 : ప్రశాంతమైన పరిపాలనకు మారుపేరు ప్రశాంత్ పాటిల్ అని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. పభుత్వ ముఖ్య కార్యదర్శిగా నీటిపారుదల అండ్ కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు బదిలీపై వెళుతున్న ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు అభినందన సభ, నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మను చౌదరికి స్వాగత సభ శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మాట్లాడుతూ తనకు తొలుత వరంగల్ స్పెషల్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చారని, ఆ సమయంలో ప్రశాంత్ పాటిల్ వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌గా ఉన్నారని గుర్తుచేసుకున్నారు. ఎంతటి ఒత్తిడినైనా ప్రశాంతంగా పనిచేయడం చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. ఆయన అన్నిస్థాయిల అధికారులు, ప్రజలను ఒకేలా గౌరవిస్తూ మాట్లాడేవారని గుర్తుచేసుకున్నారు.

అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేశా

ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ సిద్దిపేట కలెక్టర్‌గా పనిచేయడం ప్రత్యేక అనుభూతినిచ్చిందని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విధులను సక్రమంగా నిర్వహించానని చెప్పారు. అవగాహన, ముందస్తు ప్రణాళిక ఉంటే ఎస్ఎంఎస్‌ల ద్వారా కూడా పనులను నిర్వహించవచ్చని తెలిపారు. ఇప్పటివరకు తాను ఐదు జిల్లాల్లో పని చేశానని, ఇతర జిల్లాలతో పోలిస్తే సిద్దిపేటలో పనులు చాలా వేగంగా జరిగాయన్నారు. పరిపాలనలో అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, బదిలీపై వెళ్లిన అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, సీపీ శ్వేత అన్ని విధాలుగా సహాయసహకారాలు అందించారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు బదిలీపై వెళ్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను, నూతన కలెక్టర్ మను చౌదరి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీ అనురాధ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు పరిపాలనే లక్ష్యం : కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 : ప్రభుత్వ ముఖ్య పథకాలకు ప్రాధాన్యతనిస్తూ పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. ఆయన శనివారం కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. మను చౌదరి కుటుంబ సమేతంగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ స్వాగతం పలికారు. జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది నూతన కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, విద్యార్థులకు సరైన మోటివేషన్ ఇప్పించి కార్పొరేట్ స్థాయికి మించి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి భూకబ్జాలు జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

1450 కిలోల నాసిరకం పత్తి విత్తనాలు పట్టివేత

- విలువ రూ.35 లక్షలు.. ఇద్దరిపై కేసు నమోదు

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24 : హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో అక్రమంగా నిలువ చేసిన 1,450 కిలోల నాసిరకం పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. హుస్నాబాద్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... మహ్మదాపూర్ గ్రామంలో నాసిరకం పత్తి విత్తనాలను నిల్వ చేశారనే సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, హుస్నాబాద్ పోలీసులు గ్రామంలోని ముక్కెర మల్లయ్య ఇంట్లో దాడులు నిర్వహించారు. 50 కేజీల చొప్పున కంపెనీ పేరు లేకుండా 29 బ్యాగులను నిల్వ చేసినట్లు గుర్తించారు. వరంగల్ జిల్లా వేలేరు గ్రామానికి చెందిన పిండి సురేష్, కరంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లికి చెందిన సతీష్ హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలతో పాటు ఇతర జిల్లాల్లో రైతులకు నాసిరకం పత్తి విత్తనాలు విక్రయించేందుకు వీటిని నిల్వ చేసినట్లు విచారణలో తేలింది. అందులో భాగంగానే సతీష్ అమ్మగారైన మహ్మదాపూర్‌లోని ముక్కెర మల్లయ్య ఇంట్లో వీటిని నిల్వ చేశారు. దీంతె ఇంటిపై దాడి చేసి పిండి సురేష్, సతీష్‌పై కేసు నమోదు చేశారు. నకిలీ, నాసిరకం విత్తనాలు పురుగు మందుల వివరాలు తెలిసిస్తే సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల ఫోన్ నంబర్ 8712667447, 871266446కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మహేష్ కోరారు.



నాసిరకం విత్తనాలు



పోలీసులు పట్టుకున్న నాసిరకం పత్తి విత్తనాల బ్యాగులు

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కలు వేయాలి : అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 : మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. పల్స్‌పోలియో ఇమ్యునేషన్ ప్రోగ్రాంపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ మీటింగ్‌ను కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాల్లో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మార్చి 3వ తేదీన బూత్‌స్థాయిలో, 4, 5న ఇంటింటికీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 2,96,352 గృహాలను సందర్శించి, 0-5 వయస్సున్న 82,075 మంది పిల్లలకు పోలియో చుక్కలను అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. శిశు మరణాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, గర్భిణులకు పోషకాహారం, తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. గర్భిణులకు అశ్రద్ధ చేయకుండా ఆసుపత్రికి వెళ్లాలని, సరైన సమయంలో సరైన చికిత్స అందించడం ద్వారా శిశు మరణాలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని శిశు మరణాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ మాట్లాడుతూ మూడో తేదీ ఆదివారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు తెరిచే ఉంటాయని ఐదేళ్ల లోపు పిల్లలకి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ సమావేశంలో స్టేట్ సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ మురారి రాజేంద్రప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విజయరాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రజిని, ప్రభాకర్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- మార్చి 6 వరకు స్వీకరణ.. 10న ప్రవేశ పరీక్ష

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 24 : గ్రూప్ 1, 2, 3, 4, ఎస్ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర రాష్ట్ర, కేంద్ర స్థాయి ఉద్యోగాలకు టీఎస్సీ స్టడీ సర్కిల్ ఫౌండేషన్ కోర్సు ద్వారా ఐదు నెలల పాటు ఉచిత శిక్షణను అందజేస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత తెలిపారు. ఈ నెల 23 నుంచి మార్చి6 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు 10వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 7 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు వచ్చిన మెరిట్ ఆధారంగా 75 శాతం ఎస్సీలకు, 15 శాతం బీసీలకు, 10 శాతం ఎస్టీలకు, ఇందులో 33 శాతం మహిళలకు, ఐదు శాతం దివ్యాంగులకు సీట్లు కేటాయిస్తామని వివరించారు. మార్చి 18 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఐదు నెలల పాటు కొనసాగుతాయని కవిత తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు కుల, ఆదాయం, పదో తరగతి, డిగ్రీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాలికను పొలంలో ముంచి.. చంపిన మేనమామ

- మతిస్థిమితం లేక దారుణానికి ఒడిగట్టిన వైనం
- చితకబాదిన గ్రామస్థులు





మేనమామ చేతిలో మృతి చెందిన శిరీష, నిందితుడు శ్రీను

నంగునూరు, ఫిబ్రవరి 24: మతిస్థిమితం లేని మేనమామ తన మేనకోడల్ని బురద పొలంలో ముంచి చంపిన సంఘటన శనివారం నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన పిట్టలు పట్టే కులస్థులు గుజరాతి సంతోష, రాజు దంపతులు. వారికి కుమార్తె శిరీష(3) ఉంది. వారు నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి వచ్చి వేముల శశిధర్‌రెడ్డికి చెందిన మామిడి తోట లీజుకు తీసుకొని అందులోనే నివాసం ఉంటున్నారు. వీరితో పాటే సంతోష అన్న శ్రీను ఉంటున్నాడు. మతిస్థిమితం లేని శ్రీను శనివారం తోట సమీపంలో ఉన్న పొలంలోని వరిని ధ్వంసం చేశాడు. మామ చేస్తున్న పిచ్చి పనులను శిరీష అక్కడే నిల్చుని చూస్తున్నది. శ్రీను శిరీష వద్దకు వెళ్తుండగా తప్పించుకునేందుకు బాలిక కేకలు పెడుతూ పరుగెత్తింది. వెంటాడిన శ్రీను చిన్నారిని పట్టుకొని పక్కనే వరి నాట్లు వేసిన బురద పొలంలో ముంచాడు. శిరీష కేకలు విన్న తల్లిదండ్రులు పరుగెత్తుకుంటూ వెళ్లి శిరీషను బురదలో నుంచి బయటకు తీయగా.. అప్పటికే చిన్నారి మృతి చెందడంతో గుండెలవిసేలా ఏడ్చారు. ఈ సంఘటన తెలుసుకున్న చుట్టుపక్కల వారు... శ్రీను పారిపోతుండగా పట్టుకొని చితకబాదారు. పోలీసులకు సమాచారం అందడంతో శ్రీనును అదుపులోకి తీసుకొని బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రాజగోపాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్నకు పల్లకీ సేవ భాగ్యం దక్కేనా!

- ఏడాది క్రితం అనుమతిచ్చిన దేవాదాయశాఖ కమిషనర్
- అమలులో ఆలయవర్గాల జాప్యం



మల్లన్న దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలు

చేర్యాల, ఫిబ్రవరి 24 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ భక్తులు పల్లకీసేవ భాగ్యం కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో కొనసాగిన స్వామివారి ఉత్సవమూర్తుల సేవను పునరుద్ధరించేందుకు ఆలయవర్గాలు కొన్నినెలల క్రితం నిర్ణయం తీసుకోవడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి ఇవ్వడంతో గతేడాదే ప్రారంభించనున్నట్లు ఆలయాధికారులు ప్రకటించారు. కానీ, ఏడాదైనా అమలుకు నోచుకోలేదు.



ఉత్సవ సమయంలో పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయవర్గాలు

పల్లకీ సేవతో అనుగ్రహం

ఆలయాల్లో ప్రతిష్ఠించిన మూలవిరాట్టును కదిలించే అవకాశం ఉండదు. ఉత్సవమూర్తులలో దైవాంశాన్ని ప్రవేశపెట్టి పూజలు చేస్తారు. ఉత్సవాలకు వినియోగిస్తారు. పూజకు సంబంధించిన ఉపచారాలలో పల్లకీసేవను కూడా ఉపచారంగా భావించి ఉత్సవమూర్తులతో నిర్వహిస్తారు. తద్వారా దైవం సంతోషించడం, పరిపాలిత ప్రాంతం కూడా సుభిక్షంగా ఉండటంతో పాటు పల్లకీ మోసిన వారికి, దేవతామూర్తులను చూసిన వారికి సంపూర్ణ అనుగ్రహం కలుగుతుందని నమ్మకం.

25 ఏళ్ల క్రితం నిలిచిన సేవ

గతంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలతో నిత్యం సాయంత్రం వేళ ఆలయ మండపం నుంచి గంగిరేగుచెట్టు ప్రాంగణం మీదుగా రాతిగీరెల వరకు పల్లకీసేవ నిర్వహించేవారు. అందుకు టికెట్ ధర రూ.65 ఉండేది. సుమారు 25ఏళ్ల క్రితం ఈ సేవను నిలిపివేశారు. తదనంతరం ఎవరూ పట్టించుకోలేదు. ఇతర ఆలయాల్లో పండగ వాతావరణంలో పల్లకీ సేవ కొనసాగు తుండటంతో మల్లన్న సేవను పునరుద్ధరించాలని భక్తులు ఆలయవర్గాలను కోరాయి. ఈవిషయమై మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మూడేళ్ల క్రితం సూచనలు చేయడంతో ఆలయవర్గాలు సమీక్షించి టికెట్ ధర రూ.500 నిర్ణయిస్తూ ప్రతిపాదనలు పంపించారు. దేవాదాయశాఖ కమిషనర్ అనుమతినివ్వడంతో గతేడాది ఏప్రిల్ నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. గతంలో పద్మశాలీ కులస్థులు పల్లకీని మోసేవారు. అందుకు వారికి టికెట్ ధరలో కొంతమొత్తం చెల్లించేవారు. భక్తులు టికెట్ తీసుకుని పాల్గొనేవారు. కానీ, ప్రస్తుతం భక్తులే పల్లకీ ఎత్తుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కాగా టికెట్‌కు సంబంధించి ఎంతమందిని అనుమతించాలి. ఒకవేళ భక్తులు రానియెడల ఎవరిచే నిర్వహింపజేయాలి అన్న విషయం ఆలయాధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఈవిషయమై ఆలయవర్గాలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపిన మార్కెట్ కమిటీ చైర్మన్

జహీరాబాద్, ఫిబ్రవరి 24: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన ఆగమ సాయిచరణ్ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన ఎంపికకు సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు, మాజీ మంత్రి ఆగమ చంద్రశేఖర్‌కు నిరంతరం రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషిచేస్తానని సాయిచరన్ చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ మంత్రి చంద్రశేఖర్, నాయకులు, తదితరులు ఉన్నారు.

చదువుపై శ్రద్ధ పెట్టాలి

● గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్



వాటర్ ఫిల్టర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న నిర్మల

కొండపాక, ఫిబ్రవరి 24: ఒత్తిడికి గురికాకుండా ప్రతిరోజూ చదువుపై దృష్టి సారిస్తే ఎలాంటి విషయాలైనా అర్థమవుతాయని గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడ గురుకుల పాఠశాలను శనివారం ఆమె సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కేవలం పరీక్షల కోసమే చదవడం కాదు, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలోనే చదివి ఒత్తిడి గురికాకుండా మొదటి నుంచి చదవడం అలవాటు చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం మానకొండూరు నియోజకవర్గం అన్నారం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త కిష్టారెడ్డి సహకారంతో పాఠశాలలో ఏర్పాటుచేసిన నీటి శుద్ధీకరణ ప్లాంటును ఆమె ప్రారంభించారు. అన్నింటికీ ప్రభుత్వంపైనే ఆధారపడకుండా దాతల సహకారంతో సౌకర్యాలను కల్పించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహాచారి, గురుకుల పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు చిట్యాల నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రంజిత్ కుమార్, శ్వేత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గుర్తింపు కోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ తెలిపారు.

అవసరానికి సరిపడా విద్యుత్

● విద్యుత్‌శాఖ జిల్లా ఇన్‌చార్జి మహేష్‌కుమార్



సిద్దిపేట జిల్లా విద్యుత్ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి, సమావేశానికి హాజరైన అధికారులు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 24: సిద్దిపేట, దుబ్బాక, సిద్దిపేట రూరల్ డివిజన్ పరిధిలో అవసరానికి సరిపడా విద్యుత్ ఉందని, సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని విద్యుత్‌శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి మహేష్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా విద్యుత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. వ్యవసాయ సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా చేస్తామని, గృహావసరాలకు ఎలాంటి అంతరాయం ఉండదని మహేష్‌కుమార్ తెలిపారు. సిద్దిపేట సబ్‌డివిజన్, సిద్దిపేట రూరల్ సబ్ డివిజన్, దుబ్బాక సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు, అంతరాయం ఉండదని తెలిపారు. రబీ(యాసంగి) పంట చేతికందేవరకూ విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాబోవని స్పష్టం చేశారు. కిందిస్థాయి సిబ్బంది సైతం విద్యుత్ వినియోగదారులకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేయడానికి తాము ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల సిద్దిపేటలో జరిగిన విద్యుత్ ప్రమాదం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని వెల్లడించారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేస్తాం: గజ్వేల్ డీఈ



తొగుట:విద్యుత్ సిబ్బందితో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ గజ్వేల్ డీఈ

తొగుట, ఫిబ్రవరి 24: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ గజ్వేల్ డీఈ భానుప్రకాష్ వెల్లడించారు. శనివారం తొగుట - రాంపూర్ కోటిలింగాల ఆలయం ఆవరణలో విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సిబ్బందికి సూచించారు. రైతులు విద్యుత్ మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించి విద్యుత్ అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ తుక్కాపూర్ ఏడీఈ శ్రీనివాస్‌రావు, తొగుట, కొండపాక, కుకునూర్‌పల్లి, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల ఏఈలు సత్యం, రాజేంద్రప్రసాద్, వాసుదేవరావు, శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. బాలుడి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు

కొండపాక, ఫిబ్రవరి 24: కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడకండ్ల వద్ద రాజీవ్ రహదారిపై శనివారం బైక్‌ను లారీ ఢీ కొట్టిన సంఘటనలో బాలుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి రాములు భార్య లక్ష్మి, మనవడు సాత్విక్ (15)తో కలిసి బైక్‌పై నాగిరెడ్డిపల్లికి బయలుదేరారు. అదే సమయంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా రాములు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా, తీవ్రంగా గాయపడిన సాత్విక్ మృతి చెందాడు. రాములును ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కూలీ మృతి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 24: నూతన భవన నిర్మాణ పనుల్లో పని చేస్తున్న సెంట్రింగ్ కూలీ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని టీహెచ్ ఆర్‌నగర్‌లో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీ శ్యామ్‌రామ్(21) టీహెచ్‌ఆర్‌నగర్‌లో ఓ బిల్డింగ్‌పై సెంట్రింగ్ వర్క్ చేస్తున్నాడు. ఇందులో భాగంగా అతడు మధ్యాహ్నం బిల్డింగ్ పైకి ఎక్కి సెంట్రింగ్ డబ్బాలను తొలగిస్తుండగా చేతిలో ఉన్న ఇనుప రాడ్ ప్రమాదవశాత్తు జారి పక్కనే ఉన్న విద్యుత్ వైర్‌కు తగిలింది. దీంతో భవనం పై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



కొండగల్ల నాగమణి(ఫైల్)

వర్గల్, ఫిబ్రవరి 24: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామంలో చోటు చేసుకున్నది. శనివారం గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన నాగమణి(36)కు 20ఏళ్ల క్రితం వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామానికి చెందిన కొండగల్ల కృష్ణతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొన్నేళ్లుగా కృష్ణ మద్యానికి బానిసై నిత్యం నాగమణిని వేధింపులకు గురిచేయడంతో ఏడాది క్రితం ఆమె కొడుకులతో కలిసి లాల్‌గడి మలక్‌పేట గ్రామంలోని పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. ఇటీవల భర్త కృష్ణ బైక్ పైనుంచి కిందపడి గాయపడడంతో ఈ నెల 5న భర్తను చూసేందుకు నాగమణి తునికిఖాల్సాకు వెళ్లి, అక్కడే ఉన్నది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో పెద్ద కొడుకు సంతోష్‌కు నాగమణి ఫోన్ చేసి మద్యంమత్తులో కృష్ణ తనను కొట్టాడని చెప్పింది. శనివారం మధ్యాహ్నం 3గంటల సమయానికల్లా నాగమణి ఇంటిముందు విగత జీవిగా పడి ఉన్నది. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. నాగమణి మెడ, కుడి చెవికి గాయాలు ఉండడంతో హత్య చేశారనే అనుమానంతో మృతురాలి తండ్రి సిరిసాదుల అర్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి గజ్వేల్ రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిల్లా ప్రజలకు షబ్-ఏ - బరాత్ శుభాకాంక్షలు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 24 : షబ్- ఏ - బరాత్ పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు జిల్లాలోని ముస్లిం మైనారిటీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు రెండు రోజుల ఉపవాస దీక్ష చేయడంతోపాటు రాత్రంతా జాగారం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని, ఖురాన్ చదువుతారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థిస్తున్నట్టు చెప్పారు.



రామలింగేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మద్దూరు, ఫిబ్రవరి 24: ధూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని రామాచల క్షేత్రంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబిక సహిత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి మేలుకొలుపు, 6గంటలకు దిష్టి కుంభం చేపట్టారు. ఉదయం 10గంటలకు పారునంది ఆంజనేయశర్మ వైదిక నిర్వహణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో పారునంది విశ్వనాథశర్మ పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 24: మార్చి 9వ తేదీన సిద్దిపేట కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సిద్దిపేట జిల్లా న్యాయమూర్తి రఘురాం పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు భవనంలో న్యాయవాదులు, పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో క్రిమినల్, సివిల్ కేసులు, మోటార్ వాహనాల కేసులు అధిక మొత్తంలో ఉన్నాయని, జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసులను రాజీ కుదిరిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన కొండపాక తహసీల్దార్

కొండపాక, ఫిబ్రవరి 24 : కొండపాక నూతన తహసీల్దార్ జి. బాలరాజు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ గజ్వేల్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన బాలరాజుకు డిప్యూటీ తహసీల్దార్ నీలిమ, సిబ్బంది స్వాగతం పలికారు.

లకుడారం పాఠశాలలో స్వయం పాలన

కొండపాక, ఫిబ్రవరి 24 : కుకునూరుపల్లి మండలం లకుడారం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు విద్యాధికారులుగా ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలను బోధించారు. డీఈవోగా దేవి హర్షిత్, ఎంఈవోగా కంకణాల మనస్విని, హెచ్‌ఎంగా పవన్ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో సుబ్రమణ్యస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన వెల్దండి జ్యోతి-సత్యనారాయణ దంపతులు రూ. 1.10 లక్షల నగదును ఆలయ నిర్మాణ కమిటీకి అందజేసినట్లు మాజీ సర్పంచ్ తొడేటి రమేష్ తెలిపారు. శనివారం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డుకు భూమి పూజ

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని పందిల్ల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ. 20 లక్షల సీసీ రోడ్ల పనులకు శనివారం టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య భూమిపూజ చేశారు.

సామాజిక ఉద్యమకారుడికి కర్ణాటక ప్రభుత్వం నుంచి ఆహ్వానం

దుబ్బాక, ఫిబ్రవరి 24: డీబీఎఫ్ జాతీయ కన్వీనర్, సామాజిక ఉద్యమకారుడు శంకర్‌కు కర్ణాటక ప్రభుత్వం ఆహ్వానం పంపింది. రెండు రోజులుగా కర్ణాటక ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత రాజ్యాంగం - దేశ ఐక్యత అనే అంశంపై జరుగుతున్న సదస్సుకు రావల్సిందిగా ఆ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప ఆహ్వానం పలికారు.

జనం నుంచి వనానికి వనదేవతలు



కొమురవెల్లిలో చివరిరోజు అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో భక్తులు, అమ్మవార్లను వనంలోకి తీసుకెళ్తున్న నిర్వాహకులు

చేర్యాల, ఫిబ్రవరి 24: కొమురవెల్లిలో నాలుగు రోజులుగా భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క-సారలమ్మలు జనం వీడి వనంలోకి చేరుకున్నారు. ఈ మేరకు శనివారం జాతర ముగియడంతో జాతర నిర్వాహకులు అమ్మవార్లను సంప్రదాయబద్ధంగా కొమురవెల్లి శివారులోని గుట్టకు చేర్చారు. చివరిరోజు కావడంతో పొరుగు గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చుకుని తిరుగుపయనమయ్యారు. నాలుగురోజులుగా డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, భక్తజనంతో సందడిగా కనిపించిన కొమురవెల్లి శివారు నిర్మానుష్యంగా మారింది. అలాగే కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లితో పాటు చేర్యాల పట్టణ శివారు బురాన్‌మియాతోట, గట్టుతోటలో కూడా అమ్మవార్ల జాతరను ఘనంగా ముగించారు.

● **మద్దూరు:** ధూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామంలో సమ్మక్క-సారలమ్మ జాతర శనివారం సాయంత్రంతో ముగిసింది. నాలుగు రోజులపాటు భక్తుల పూజలందుకున్న వనదేవతలు వనంలోకి చేరుకున్నారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య కోయపూజారులు తమ సంప్రదాయపద్ధతిలో వనంలోకి తీసుకువెళ్లారు. అంతకుముందు అమ్మవార్ల గద్దెలను భక్తులు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను విజయవంతం చేసిన భక్తులకు, సహకరించిన అధికారులకు, గ్రామపెద్దలకు జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతిలో భక్తులు

నంగునూరు, ఫిబ్రవరి 24: మండలంలోని కోనాయిపల్లిలోని వేంకటేశ్వరాలయ వార్షికోత్సవ ముగింపు సందర్భంగా శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు కావడంతో గ్రామస్థులు ఉదయం ఆరాధన. స్వామివారికి అభిషేకం, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఏకాంత సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

టీటీడీ ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతాలు

దుబ్బాక, ఫిబ్రవరి 24: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట సీతారామాలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. లోకకళ్యాణార్థం 5 జంటలతో సత్యనారాయణ వ్రతాలను నిర్వహించినట్లు వైదిక పురోహితుడు శివకుమార్‌శర్మ తెలిపారు.

గజ్వేల్‌లో షిరిడీసాయి ఆలయ వార్షికోత్సవం

గజ్వేల్, ఫిబ్రవరి 24: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారుల ఆధ్వర్యంలో ఉదయం షిరిడీ సాయి విగ్రహానికి ఆవు పాలతో అభిషేకించారు. అనంతరం లలితా సహస్ర నామ పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అన్నప్రసాదవితరణకు భారీగా భక్తులు హాజరయ్యారు. వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి హాజరయ్యారు.

డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన కారు



బోల్తా పడిన కారు

గజ్వేల్, ఫిబ్రవరి 24: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉమా మహేశ్వరస్వామి కమాన్ వద్ద డివైడర్‌ను కారు ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కారులో గజ్వేల్‌కు వస్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

ప్రైవేట్ హాస్టల్ తీరుపై ఆందోళన



హాస్టల్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 24 : జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టడం లేదని శుక్రవారం రాత్రి విద్యార్థుల తల్లిదండ్రులు గొడవకు దిగారు. హాస్టల్ సిబ్బందికి విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాచిపోయిన ఆహారం పెడుతున్నారని ఆరోపించారు. ఉదయం చేసిన ఆహారం రాత్రి, రాత్రి చేసింది మరుసటి రోజు ఉదయం వడ్డిస్తున్నారని, కుళ్లిపోయిన, ఉడక బెట్టిన గుడ్లను ఆహారంగా ఇవ్వడంతో విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. కొన్ని సమయాల్లో ఫంక్షన్‌హాల్‌లో మిగిలిన ఆహారాన్ని కూడా తీసుకువచ్చి విద్యార్థులకు పెట్టారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు శ్రీ చైతన్య హాస్టల్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు. హాస్టల్ వార్డెన్‌పై, కాంట్రాక్టర్‌పై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కీర్తి సురేష్

సాదాసీదాగా కోహెడ మండల సర్వసభ్య సమావేశం

కోహెడ, ఫిబ్రవరి 24: రానున్న వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్ సూచించారు. శనివారం కోహెడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొక్కుల కీర్తి అధ్యక్షతన సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు హాజరయ్యారు. వ్యవసాయ, ప్రాథమిక విద్యా, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, మిషన్ భగీరథ, రెవెన్యూ, పౌరసరఫరాలు, రోడ్డు, భవనాలు, విద్యుత్, ఈజీఎస్, స్త్రీ, శిశు సంక్షేమం, అటవీ, పశు సంవర్ధక శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖలపై అధికారులు నివేదిక అందజేశారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో అభివృద్ధిపై ఎలాంటి చర్చ జరగలేదు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుధ్య చర్యలతో పాటు దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్చి 3 నుంచి పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో సమస్యలపై స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిష్టయ్య, తహసీల్దార్ సురేఖ, ఏవో భోగేశ్వర్, వైద్యాధికారి నిమ్రా, పశువైద్యాధికారి శ్రావణ్ కుమార్, ఏపీవో తిరుపతి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



గజ్వేల్‌లోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సైదా



మిరుదొడ్డి హైస్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ పరశురాములు

గజ్వేల్, ఫిబ్రవరి 24: త్రిబుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ నేరమని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ తదితర ట్రాఫిక్ నిబంధనలపై గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. రోడ్డు విద్యార్థి దశ చాలా కీలకమైనదని, మైనర్లు ఎట్టి పరిస్థితిలోనూ ద్విచక్ర వాహనాలు నడపవద్దన్నారు. విధిగా సైన్‌బోర్డు సూచనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలని, రోడ్డుకు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయవద్దన్నారు. వారితో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో ట్రాఫిక్ సీఐ మురళి ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలన్నారు. త్రిబుల్ రైడింగ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలన్నారు.

● **మిరుదొడ్డి:** విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని, ర్యాగింగ్‌లాంటి భూతాలను కళాశాలల నుంచి తరిమివేయాలని మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు తెలిపారు. శనివారం మిరుదొడ్డి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. నాగరికమైన సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేదన్నారు. తోటి విద్యార్థులపట్ల సోదరభావంతో మెలగాలని సూచించారు. ఆడపిల్లలను వేధించే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిజీ రామేశ్వరం యాత్రకు ఘన స్వాగతం



కుకునూరుపల్లిలో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

కొండపాక, ఫిబ్రవరి 24 : గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు సాష్టాంగ నమస్కారం చేస్తూ యాత్ర చేపట్టిన రాజగిరి మహదేవ్ అనే సాధువుకు కుకునూరుపల్లిలో గ్రామస్థులు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. సాధువును పూలమాలలతో శాలువాతో సత్కరించి రూ. 3వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, విశ్వహిందూ పరిషత్ జిల్లా బాధ్యుడు, వాసవీక్లబ్ ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడు ఉప్పల రాజు గ్రామస్థులు పాల్గొన్నారు.

గజ్వేల్ క్రికెట్ లీగ్ టోర్నీ ప్రారంభం



గజ్వేల్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎన్‌సీ సంతోష్

గజ్వేల్, ఫిబ్రవరి 24: పట్టణంలోని ఐవోసీ మైదానంలో గజ్వేల్ క్రికెట్ లీగ్ టోర్నీని కబడ్డీ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ గుప్తా ప్రారంభించారు. మైనంపల్లి టైగర్స్ వర్సెస్ సూర్య వారియర్స్ మధ్య మొదటి మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ గుప్తా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వానికి దోహదపడుతాయన్నారు. అనంతరం ఆర్గనైజర్ సూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ క్రికెట్ లీగ్ నిర్వహణకు స్పాన్సర్‌గా ముందుకు వచ్చిన ఎన్‌సీ సంతోష్‌గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు

యువకుడి మృతికి కారణమైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

గజ్వేల్, ఫిబ్రవరి 24: కులాంతర వివాహం చేసుకున్న యువకుడి మృతికి కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. శనివారం దాతర్‌పల్లి గ్రామంలో బాధిత దళిత యువతి కుటుంబాన్ని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలం బీజీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులానికి చెందిన నాగపురి నితిన్ గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన దళిత యువతిని కులాంతర వివాహం చేసుకోగా, నితిన్ మృతికి కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అంబిటస్ స్కూల్ వార్షికోత్సవం



విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు

సిద్దిపేటక్రైం, ఫిబ్రవరి 24: పట్టణంలోని స్థానిక భారత్‌నగర్‌లో ఉన్న అంబిటస్ స్కూల్ 10వ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యం

గజ్వేల్, ఫిబ్రవరి 24: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.నర్సారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అక్కారం గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయనవెంట టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాయిని యాదగిరి, నాయకులు తదితరులున్నారు.

26న సిద్దిపేటకు బీజేపీ విజయ సంకల్పయాత్ర

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 24 : బీజేపీ విజయ సంకల్ప యాత్ర ఈ నెల 26న సిద్దిపేటలోకి ప్రవేశిస్తుందని,ఈ యాత్రను దిగ్విజయం చేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్రలో పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు సిద్దిపేట పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ చౌరస్తాకు యాత్ర చేరుకుంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు శివాజీ చౌక్ వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు.

● **గజ్వేల్:** బీజేపీ విజయసంకల్ప బస్సు యాత్ర ఈ నెల 25న గజ్వేల్ పట్టణానికి చేరుకుంటుందని గజ్వేల్ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్, పంజాల అశోక్‌గౌడ్ తెలిపారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5గంటలకు ఇందిరాపార్కు చౌరస్తాలో బహిరంగ సభ ఉంటుందన్నారు.

● **చిన్నకోడూరు:** విజయ సంకల్పయాత్రలో భాగంగా ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే బైక్ ర్యాలీ, బహిరంగ సభలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ అన్నారు. శనివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

తెలంగాణ పండుగలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక



ఉత్సవాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 24: తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు భిన్న సంస్కృతికి ఆనవాళ్లని, ఇక్కడి పండుగలు కులమతాలకు అతీతంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దుబ్బాక మండలం రఘోత్తంపల్లి గ్రామంలో మహంకాళమ్మ ఆలయం ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండాలని, మల్లన్నసాగర్ కాలువలు పూర్తికావాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నారా గౌడ్, భూపతిరెడ్డి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులున్నారు.